"ప్రేమ ఏమిటి కావస్తోంది. ఇంకా పడుకునే ఉన్నావా?" అంటూ వసుంధర గదమాయించగా ఉలిక్కిపడి లేచాడు రాజు. అతనికి ఒళ్ళంతా నెప్పులుగా ఉంది. కళ్ళు మండుతున్నాయి. తల భారంగా ఉంది. కానీ వసుంధర గదమాయింపు అతన్ని కంగారుపెట్టింది.

ప్రేమ ఏమిటవుతూంది, తనింకా చూచిరాత వ్రాయగాలి, హోంవర్కు చెయ్యాలి. తెలుగు పాఠం ఒకటి కంఠతా పట్టాలి. ఇవన్నీ రాత్రి బద్ధకంగా ఉండడంవల్ల తను ఉదయానికి వాయిదా వేశాడు. ఇప్పుడెలాగ?

కాలకృత్యాలు త్వరగా తీర్చేసుకుని అతను వసుంధర ఇచ్చిన పాలు గడగడా తాగేసి పుస్తకాలన్నీ చిందరవందరగా చుట్టూ పడేసుకుని, ముందు చూచి వ్రాత వ్రాసేశాడు. తరవాత ఆ పుస్తకాన్ని పక్కన పడేసుకుని లెక్కలు చెయ్యడం మొదలుపెట్టాడు. తదేక ధ్యానంతో లెక్కలు చేస్తూన్న అతను వెనకాలనుంచి పాకుతూ బాబు రావడంచూచి, వ్రాత పుస్తకాన్ని తియ్యడం గమనించలేదు.

పదినెలల బాబుకి పుస్తకాలను జాగ్రత్తగా పట్టుకోవడం తెలియదు. అలా అని పుస్తకాలు తియ్యడం మానడు. బాబు నెమ్మదిగా పుస్తకాన్ని లాగి పేజీలను అటూ ఇటూ కదపడంలో కొన్ని కాగితాలు చిరిగాయి. ఆ కాగితాలు చిరుగుతూ చేసిన శబ్దానికి ధ్యానభంగం కాగా రాజు ఉలిక్కిపడి అటు తిరిగాడు.

మేష్టరు కొడతారని భయపడి తను తొందరపడి రాసిన చూచిరాత పుస్తకం చిరిగిపోయిన కాగితాలతో అతని కళ్ళబడింది. అందుకు కారకుడైన బాబు ఓ చిన్న కాగితాన్ని నములుతూ నిశ్చింతగా నవ్వుతున్నాడు. అతని నోట్లోంచి చొంగ పుస్తకంమీద కూడా కారుతూంది.

రాజుకు కోపం ముంచుకు వచ్చింది. వెంటనే అతను చేసిన పని, బాబువీపు ఛెళ్ళుమనిపించడం! వెను వెంటనే బాబు ఏడుపు ఇల్లంతా ప్రతిధ్వనించడమూ, వసుంధర వంటింట్లోంచి పరుగెత్తుకు రావడమూ జరిగాయి.

రాగానే వసుంధర కళ్ళబడిన దృశ్యం, గుక్కపట్టి ఏడుస్తూన్న బాబూ క్రూరంగా బాబువంక చూస్తూన్న రాజూను... జరిగినదేమిటో ఆమెకర్థమైపోయింది. గుక్కతిప్పుకోలేక పోతున్న బాబుకు రెండు చెవులూ మూసి "లేదు నాన్నా, ఏడవకు మరి!" అంది. అప్పటికి బాబుకి గుక్క తిరిగిందికానీ ఏడుపు మానలేదు. వసుంధర కోపంగా రాజువంక చూసింది. "వాణ్ణి కొట్టావా?"

"అది కాదుపిన్నీ, మరి వాడు నా పుస్తకాలు..."

"నోర్ముయ్!" రాజు చెంప ఛెళ్ళుమంది.

అప్పుడే స్నానాల గదినుంచి బయటకు వస్తూన్న రామకృష్ణ ఆ దృశ్యాన్ని చూశాడు. "ఏమయింది?" అతను ప్రశ్నించాడు.

"బాబు నా చూచిరాత పుస్తకం చింపేశాడు, అందుకని..."

"అందుకని చంటిపిల్లవాణ్ణి అంతదెబ్బకొడతావా?" వసుంధర గుడ్లురిమిచూస్తూ, బాబు వీపునిమురుతూ అడిగింది రాజుని. ఉక్రోషంతో రాజు అక్కణ్ణించి తన గదిలోకి పరిగెత్తాడు.

రామకృష్ణ అదోలా నవ్వి— "రాజుకూడా చిన్న పిల్లవాడే వసూ, వాడికీ ఏండా తొమ్మిదేళ్ళు లేవు. అయినా వాడిని నువ్వు తక్కువ దెబ్బేమీ కొట్టలేదు." అని వెళ్ళిపోయాడు.

చెంప ఛెళ్ళుమన్నట్లయింది వసుంధరకు!

అవును, ఉద్రేకంలో జ్ఞానం తెలిసిన తనే రాజును కొట్టింది. అటువంటప్పుడు, జ్ఞానం తెలియనిరాజు ఉద్రేకంలో బాబును కొట్టడంలో ఆశ్చర్యమేముంది? అది పొరపాటని తను ఎందుకనుకోవాలి?

లోపలికి వినిపించేలా బూట్లచప్పుడుచేస్తూ పుస్తకాల సంచీ భుజానికి తగిలించుకుని వెళ్ళిపోయాడు రాజు.

రామకృష్ణ మాటలనించి తగిలిన ఆఘాతాన్నించి వసుంధర ఇంకా తేరుకోలేదు. నప్పుమాడిపోతూన్న వాసన వస్తూంటే చటుక్కున బాబుని కిందికి దింపి వంటింట్లోకి పరిగెత్తింది.

# ప్రేమిస్తున్నావా?

వంటచేస్తూందన్నమాటేగాని ఆమె మనస్సు మనస్సులో లేదు. జరిగిన సంఘటన ఆమెను కలచివేస్తూంది. అయిదేళ్ళుగా కాపరంచేస్తూ, ఎప్పుడూ రాజును కొట్టని తను ఈ నాడు వాడిని కొట్టింది. అదీ—ఆయన సమక్షంలో... ఇక వారేమనుకుంటారు?

"వంటయిందా? మరి నాకు టైమవుతూంది!"

"ఇదిగో, వడ్డించేస్తున్నా. మీరు వచ్చి కూర్చోండమే."

రామకృష్ణ భోంచేస్తున్నప్పుడు ముభావంగానే ఉన్నాడు. చాలాసేపటివరకూ వసుంధర కూడా ఏమీ మాట్లాడలేదు. కాని, రామకృష్ణ పులుసు కలుపుకుంటూండగా ఉండబట్టలేక అనేసింది ఆమె— "రాజు భోజనంకూడా చెయ్యకుండా బడికి వెళ్ళిపోయాడండీ, ఓ పూట బడి మానేసినా ఫర్వాలేదు. మీకాలేజీ దారిలోనే స్కూలు కాబట్టి వాణ్ణి ఇంటికి పంపించెయ్యండి."

రామకృష్ణ వ్యంగ్యంగా అన్నాడు. "సరే, ఇక బడి కూడా మానిపించి వాణ్ణి ఒక్క అప్రయోజకుడుగా చేద్దామనుకుంటున్నావన్నమాట!" తన మాటలు ఎంత కఠినంగా ఉన్నాయో, అనేదాకా తెలియని అతను చటుక్కున కంగారుపడి "నా ఉద్దేశ్యం అదికాదువసూ!" అని ఏదో చెప్పబోయి ఆగాడు.

వసుంధర

ఆమె ఏడుస్తూంది!

అతనికి ఆమె మీద జాలివేసింది. అనునయంగా అన్నాడు. "వాడు నీ కన్నబిడ్డ కానప్పుడు వాడి మీద నీకు ప్రేమ ఉండితీరాలని నే నేమీ నొక్కించడం లేదు వసూ, కనీసం వాడిని ద్వేషించకుండా ఉండాలని నా కోరిక—అంతే వసూ!"

అతని మాటలు ఆమె దుఃఖాన్ని పెంచడానికి సహకరించాయి తప్ప, ఏ విధమైన ఉపశమనాన్నీ కలిగించలేదు. చీర చెంగుతో కన్నీళ్ళు ఒత్తుకుంటూ, ఏడ్పు పళ్ళతో నొక్కిపెడుతూ రామకృష్ణకు మజ్జిగపోసింది.

కాలేజికి బయలుదేరుతూ అన్నాడు రామకృష్ణ— "నువ్వేం కంగారుపడకు. వాణ్ణి ఇంటికి పంపిస్తాను. ఊఁ!"

వీధి తలుపులు వేసుకుని లోపలికి వచ్చింది వసుంధర. బాబు కళ్ళు నులుముకుంటూ ఏడుస్తున్నాడు. వాడికి నిద్ర వస్తూందని గ్రహించి, మంచంమీద పడుకోబెట్టి నెమ్మదిగా జోకొట్టసాగింది ఆమె. ఓ పది నిమిషాల్లోనే బాబుకి నిద్ర పట్టేసింది కాని వసుంధర పరధ్యానంగా ఆలోచిస్తూ అలాగే జోకొట్టసాగింది.

రాజును తనుకొట్టడం తప్పా?

బాబుతల్లీ, రాజుతల్లీ ఒకరే అయి ఉంటే పొద్దుట ఏ విధంగా ప్రవర్తించి ఉండేది? ఆమెకూడా రాజుని కొట్టి ఉండేది ఆ ఆవేశంలో. కాని, ఆమె ఏంచేసినా చెల్లుతుంది. తను చేస్తే చెల్లదు. మరి తను సవతి తల్లి గదా!

సవతితల్లి!

నిజంగా ఈ పదాన్ని భరించవలసిన వ్యక్తి చాలా దురదృష్టవంతురాలు. ఆమెకూడా అందరివంటి స్త్రీయేనని, ఆమెలోనూ రక్తమాంసాలే ఉంటాయని లోకం అనుకోదు. లోకం దృష్టిలో ఆమె ఒక రాక్షసి. సవతి పిల్లలను బాధించడమే ఏకైక లక్ష్యంగా గలిగిన ఘాతుకి!

పుర్రెకోబుద్ధి, జిహ్వకోరుచి అన్న శాస్త్రం సవతితల్లికి వర్తించదని లోకం అభిప్రాయం. సవతి తల్లులందరూ చెడ్డవారేనని, వారిలో మంచి ఉండడానికి వీలులేదని లోకం నిర్ణయించింది. లోకం నిర్ణయించిన లక్షణాలు కనక ఒక సవతి తల్లిలో కనబడకపోతే—ఆమె ఆ లక్షణాలను సంపాదించేదాకా లోకం ఊరుకోదు. ఆమె ప్రవర్తనకూ విపరీత వ్యాఖ్యానాలు చేసి క్రమంగా ఆమెనే మార్చివేసి తన నిర్ణయానికి సార్థక్యాన్ని సంపాదిస్తుంది.

వసుంధర కష్టాల్లో పుట్టిపెరిగింది. ఆమెకూ నా అనేవాళ్ళున్నారు. వాళ్ళని ఆమె ఎంతగానో అభిమానించేది.

బాబు నిద్రపోయాడని గుర్తించిన వసుంధర జోకొట్టడం మానేసి గతాన్ని గురించి ఆలోచిస్తూ ఉండిపోయింది.

లోకానికి పేదలమీద జాలిలేదని చాలామంది వాపోతూంటారు. అది ఎంతవరకూ నిజమో చెప్పలేము గానీ, సుందరరామయ్యగారి విషయంలో మాత్రం అది నిజంకాదు.

ఆయన తొంభై రూపాయలుమాత్రమే నెలకు సంపాదించే ఒక గుమస్తా! భార్యకాక, ఎదిగిన ఒక ఆడపిల్లా, ఎదగని ఇద్దరాడపిల్లలూ, ఎదుగుతూ




ఉన్న ఇద్దరు మగపిల్లలూ ఉన్నారాయనకు. ఆయన తెచ్చే జీతంలో ఆ సంసారం కుంటినడక నడుస్తోంది.

అయితే లోకం ఆయనమీద జాలిపడడానికి కారణం వేరేఉంది. సంసారసాగరాన్ని ఈదలేకపోతున్నాడని, పేదవాడని జాలిపడడానికి బదులు, ఎదిగికూర్చున్న కూతురికిపెళ్లి చెయ్యలేకపోతున్నాడే అని బాధపడే వాళ్ళు, లోకం అని పిలవబడే చుట్టుపక్కలవాళ్ళు.

అసలు ప్రేమ అనేది జాలితో పుడతుందనీ, జాలి ఎక్కువై అలా అలా ప్రేమగా మారుతుందనీ కొందరు సిద్ధాంతీకరిస్తుంటారు. అయితే లోకానికి సుందర్రామయ్యగారి మీద కలిగిన జాలి, తద్వ్యతిరేకంగా క్రమంగా ద్వేషంగా మారసాగింది.

కూతురి పెళ్లి చెయ్యలేకపోతున్నాడే అని జాలి పడే పెద్దమనుష్యులు చివరికి, "ఏమయ్యా, కూతురి పెళ్లిచేసే ఉద్దేశ్యం లేదేమిటోనీకు?" అని ఎదటపడి నిలదియ్యటం మొదలుపెట్టారు.

వసుంధరకు పెళ్లి చెయ్యలేకపోవడం వల్ల వీళ్ళందరికి ఎందుకు బాధ కలుగుతూందో సుందరరామయ్యగారికి అర్థమయ్యేదికాదు. అర్థంకాని విషయాలను గురించి ఎక్కువగా ఆలోచించే అలవాటుకూడా ఆయనకు లేదు. అయితే ఒక విషయం మాత్రం నిజంగా బాధ




సకూ కూతురి పెళ్ళి చెయ్యాలనే ఉంది. కానీ పెళ్ళికీ, డబ్బుకీ అవినాభావ సంబంధం కదా!

వసుంధరకు పదిహేనోపడు వచ్చినప్పటినించి ఆయన పెళ్ళి ప్రయత్నాలు ప్రారంభించాడు. చివరికి ఏడేళ్ళ అనంతరం ఆయనకు ఆ సమస్య పరిష్కారమయింది.

రామకృష్ణ కానీ కట్నం కూడా అడగలేదన్నా అంటే అందుకు కారణం ద్వితీయ వివాహమే అయినా అతనికి మరీ అంత ఎక్కువ వయస్సేమీలేదు. కానీ ప్రథమ కళత్రం వల్ల కలిగిన అయిదేళ్ళ కొడుకొక డున్నాడు. ఆ విషయం తీసేస్తే ముప్ఫయ్యేళ్ళ రామకృష్ణ వసుంధరకు ఈడూ జోడూగానే ఉంటాడు.

పల్లెల్లో పుట్టి పెరిగిన వసుంధరకు ఈ వివాహంతో కష్టం ఉందనిపించలేదు. జరగబోయే వివాహానికి ఆమె హృదయపూర్వకంగానే అంగీకరించింది.

తనింకా భర్తతో కాపురం మొదలుపెట్టకుండానే తనకొక కొడుకు తయారై ఉన్నాడనీ, అందరూ తనను సవతితల్లి అని పిలుస్తారనీ, తన వివాహజీవితం మరీ అంత సులభంగా ఉండదనీ ఆమె అర్థంచేసుకుంది. కానీ మగపిల్లల చదువులు, ఎదిగి కూర్చున్న ఆడపిల్లల పెళ్ళిళ్ళు కాక, మామూలు దైనందిన సమస్యలతో నిండిన తన తండ్రి బాధలను చూస్తూ రోజూ కాలం గడపడంకంటే దూరంగా ఎక్కడికో పోయి ఎవరి పంచనో ఉండడం ఆమెకు చాలా మంచిదనిపించింది. అప్పట్లో ఆమెకు వివాహంలో కనిపించిన ప్రయోజనం అంతే!

రాజాను తన స్వంత బిడ్డకంటే ఎక్కువగా చూసుకునేది వసుంధర. రామకృష్ణకు ఆమెమీద పూర్తి నమ్మకం లేకపోయినా అనుమానించడానికి సరైన ఆధారాలేమీలేక ఊరుకునేవాడు.

అసలు వసుంధరకు కొన్ని కోరికలున్నాయి. తను రాజాచేత "అమ్మా!" అనిపించుకోవాలనీ, రాజానెంతో ఆప్యాయంగా చూసుకుంటూ వాడు తన సవతిబిడ్డ అనే తలపు తనకు రానియ్యకూడదనీను.

అయితే జ్ఞానం వచ్చిన రాజాకు వసుంధర తనతల్లి కాదని తెలుసును. ఆమెను "పిన్నీ!" అని పిలవాలని కూడా తెలుసును. వాడు వసుంధరను అమ్మ అనడానికి నిరాకరించి "నువ్వు అమ్మ వెలా అవుతావు? అమ్మ చచ్చిపోయిందిగా!" అనేవాడు. పైగా "అమ్మా" అని పిలవ మన్నప్పుడల్లా వాడికి తల్లి గుర్తుకువచ్చి ఏడుస్తూండేవాడు. ఆ బాధ పడలేక ఆమె ఆ విషయంలో నొక్కించలేదు.

కానీ ఆ విషయం ఆమెకు బాధకలిగించేది. రాజా పిన్నీ అన్నప్పుడల్లా, వాడు తన కొడుకుకాదని ఎవరో గుర్తుచేసినట్లనిపించేది. పైగా వీటన్నిటికీ తోడు ఇరుగుపొరుగుల బాధ ఒకటి! ఆమె రాజాని కొడుకుగా భావించాలని ఎంత ప్రయత్నించేదో, రాజా సవతి కొడుకని ఆమెకు గుర్తు చెయ్యడానికి కూడా వాళ్ళు అంత ప్రయత్నమూ చేసేవారు.

"ఎంతతెచ్చిపెట్టుకున్నా—సవతితల్లికి ఆపేక్ష ఎక్కణ్ణించి వస్తుంది?" అనేవారు కొందరు. "తల్లిలేని పిల్లాడు, పాపం!" అని ఆమె సమక్షంలోనే రాజా మీద జాలిపడేవారు కొందరు. "తల్లిలేని పిల్లాడని నెత్తెక్కించుకునేవు గనక, వాణ్ణి హద్దుల్లో ఉంచుకోపోతే ఆనక నీ పని అవుతుంది!" అని కొంత మంది ఆమెకు సలహా ఇచ్చేవారు.

వీటి ఫలితంగా ఆమె రాజాను తన కొడుకులా కాక ఓ అనాథ బాలుడుగా మాత్రమే ప్రేమించగలిగింది. కానీ ఆమె ఎప్పుడూ రాజాని ద్వేషించలేదు. ఆ విషయంలో తండ్రి అయిన రామకృష్ణకే సంతృప్తి కలిగింది.

రెండో వివాహం చేసుకున్నప్పట్నించీ, తనురాజాకి అన్యాయం చేశాడేమోనని రామకృష్ణను అనుమానం పీడిస్తూండేది. అందువల్ల అతను రాజా బాధ్యత పూర్తిగా వసుంధరకు వదిలివెయ్యకుండా తనూ చూసుకుంటూండేవాడు. అటువంటి విషయాల్లో ఒక్కొక్కప్పుడు వసుంధర మనస్సు గాయపరుస్తూండేవాడు కూడా. అయినా తను వసుంధరకు అన్యాయం చేస్తున్నాడేమోనన్న అభిప్రాయం అతని ఊహలో ఎన్నడూ మెదలలేదు. చివరికి అతనికి ఆమెమీద సంపూర్ణ విశ్వాసం కలిగిందనుకునేసరికి, ఆమె గర్భవతి కావడంతో పరిస్థితి మళ్ళీ మొదటికి వచ్చింది. ఆమె కడుపు ఫలించి కొడుకును కనేసరికి అతని అనుమానం శ్రుతిమించి రాగాన పడింది.

కన్నకొడుకుమీద, సవతికొడుకుమీదకంటె ఎక్కువ ప్రేమ కలిగి ఉండడం నేరమేమీ కాదు. కానీ ఆ ప్రేమ సవతి కొడుకుమీద ద్వేషాన్ని పుట్టిస్తుందనుకోవడం, అసహజంకాకపోయినా, ఆధారాలు లేనిదే విశ్వసించ వలసిన విషయం మాత్రంకాదు.

'అయితే బాధించదలిచిన వ్యక్తి ఆధారాలు దొరక నిస్తుందా?' అని రామకృష్ణ అనుమానం. అంటే వసుంధర ప్రత్యేకమైన శ్రద్ధతీసుకుని ఆధారాలు దొరకకుండా, రాజాను కష్టపెడుతూందేమోనని అతని అనుమానం!

ఆ అనుమానాలతో అతను రెండవ కొడుకు వల్ల కలిగిన ఆనందాన్ని ఎక్కువగా అనుభవించలేదుకూడా...

గడియారం కొట్టిన గంటలు వసుంధరను ఈ లోకంలోకి తీసుకు వచ్చాయి. టైము పదకొండయింది. రాజా ఇంకా రాలేదు! అసలాయన స్కూలుకు వెళ్ళి చెప్పారో లేదో? చెప్పినా, అలాగే వెడతానని రాజా అక్కడే ఉండి ఉండవచ్చు. ఏమైనా రాజాకు బాగా కోపం వచ్చి ఉంటుంది.

'పాపిష్ఠిదాన్ని, ఎంత దెబ్బకొట్టాను' అనుకుంది ఆమె.

అవునుమరి. వాడి పుస్తకాలు చింపేస్తే వాళ్ళ మేష్టారు కొడతారు. అలా చింపకూడదని బాబుకి తెలియదు. బాబుకి జ్ఞానం తెలియదని రాజాకి తెలియదు. ఒకవేళ తెలిసినా, కోపం యుక్తాయుక్త విచక్షణజ్ఞానాన్ని నశింపజేస్తుంది.

కందిపప్పు ఒలకపోశాడని, మరీ రాజా అంతగట్టిగా కాకపోయినా తనూ ఒకసారి బాబును కొట్టింది. వాడేం తెలుసు? అన్న జ్ఞానం ఆ సమయంలో తనకూ కలగ లేదు. రాజా బాబుని కొట్టడానికి అంతకంటే మంచి కారణమే ఉంది. అయినా తను తొందరపడి రాజాను...

వసుంధరకు పశ్చాత్తాపం కలగసాగింది. అసలు బాబంటే రాజాకెంతో ఆపేక్ష. తమ్ముడూ, తమ్ముడూ అని అసలెప్పుడూ వదిలిపెట్టడు. ఏదో ఈ రోజు ఉదయం అలా జరిగింది తప్ప, వాడెప్పుడూ బాబును విసుక్కోలేదు. ఒకటి రెండు సార్లు ఎత్తుకున్నప్పుడు బాబు బట్టలు పాడుచేసినా నవ్వేసి బట్టలు మార్చుకునే వాడు తప్ప మరేమీ అనుకునేవాడు కాదు.

అందులోనూ నిన్న రాత్రి నించి రాజాకు ఒంట్లో సరిగాఉన్నట్లులేదు. కొద్దిగా జ్వరం వేసినట్లుండి అదోలా ఉన్నాడు. మళ్ళీ ఈ పొద్దు కూడా భోంచెయ్య లేదు. ఏ జ్వరమైనా వస్తే?

ఆ భావం కలిగేసరికి వసుంధర వణికిపోయింది— టైము పన్నెండయింది. రాజా ఇంకా రాలేదు. ఆమెకూ భోంచెయ్య బుద్ధికాలేదు.

వసుంధర అనుమానాలు తీరిపోలేదు. ఇల్లో కళ్ళు తిరిగి పడిపోయాడని రాజును మరో అబ్బాయి సాయంతో రిక్షాలో ఇంటికి పంపించాడు స్కూలు టీచరు. ఒళ్ళు కాలిపోతున్న రాజును చూసి వసుంధర పెద్ద కంగారు ఇంతా అంతా కాదు. పక్కింటి వాళ్ళ అమ్మాయిని ప్రతిపాలి డాక్టరుకి కబురంపించింది ఆమె.

బాబు రాజా పుస్తకం చింపెయ్యడం, తను రాజుని కొట్టడం, రాజుకి జ్వరం రావడం—ఇవన్నీ కలిసివచ్చేసరికి ఆమెకేం చెయ్యాలో తోచక ఏదో తప్పు చేసిన అనుభూతి పొందసాగింది.

డాక్టరువచ్చి రాజును పరీక్షించి కొంచసేపటరుచూసి, "మరేం భయపడకమ్మా, మామూలు జ్వరమే. సాయంత్రానికల్లా దిగజారిపోతుంది" అంటూ ఓ ఇంజక్షన్ ఇచ్చి, నాలుగు బిళ్ళలిచ్చి ఎలా వెయ్యాలో చెప్పి వెళ్ళిపోయాడు.

సాయంత్రం అయిదున్నరకు రామకృష్ణ కాలేజీ నుంచి ఇంటికి వచ్చేసరికి రాజుకు జ్వరం దిగజారిపోయింది. జరిగినదంతా వసుంధర నోటినీటుగా విన్న రామకృష్ణ ఓసారి నిట్టూర్చి ఊరుకున్నాడు.

తనపై ఒక్క సానుభూతి వాక్యమన్నా పలకలేదనీ, తనే పిటపిన్నింటికీ కారకురాలన్నభావం అతని కళ్ళలో కనిపించడమూ — వీటితో ఆమెకు చాలా బాధ కలిగింది.

రాజా ఆయనకు కొడుకే కావచ్చు. మరి తనూ అతన్ని కట్టుకున్న భార్యే! కానీ, తనపై ఆయనకు సానుభూతి ఎందుకుల్లేదు! సమాధానం ప్రశ్నలోనే ఉన్నదేమోననిపించింది వసుంధరకు.

రెండు రోజులకు రాజా పూర్తిగా కోలుకున్నాడు. పథ్యంకూడా పెట్టారు. కాని అతను పిన్నితో మునపటిలా చనువుగా మాట్లాడడంలేదు. ఏదో ముభావంగా ఉంటున్నాడు.

అదే ఆమెకు బాధకలిగించింది. కనీసం ఆ పసివాడైనా తన ప్రేమ అర్థంచేసుకుని తన్ను అభిమానిస్తే చాలనుకుంటే అదీ కరువయింది.

మరో రెండురోజులు గడిచాక రాజా మళ్ళీ మామూలుగా బడికి వెళ్ళడం మొదలెట్టాడు. బడికి వెళ్ళే ముందు నసుగుతూ అడిగాడు. "పిన్నీ! నీరసంగా ఉంది. మధ్యాహ్నం ఆకలిగాఉంటే కొనుక్కుతినడానికి ఏమైనా డబ్బులిస్తావా? "

"ఒక వారంరోజులదాకా నువ్వు ఏవిధమైన చిరుతిళ్ళూ తినకూడదురా. జబ్బుచేస్తాయి. డబ్బులుంటే కొనుక్కో బుద్ధి వేస్తుంది కాబట్టి ఇవ్వను. తెలిసిందా?" అంది వసుంధర సౌమ్యంగా. ఏమనుకున్నాడో ఏమోగానీ రాజా తలవంచుకుని అక్కణ్ణుంచి వెళ్ళిపోయాడు.

"ఇలారా రాజా!" అన్న రామకృష్ణ గొంతు వినిపించి వడవలో తలుపుచాటుకువచ్చింది వసుంధర. రామకృష్ణ ఓ పావలా కాసుతీసి రాజా చేతిలో పెట్టి, "ఇంద, తీసుకో. పిన్నికి చెప్పకుండా నీకు కావలిసినవి కొనుక్కో!" అన్నాడు. అతను వసుంధరను చూసినట్టు లేదు.

ఆ దృశ్యం వసుంధరకు చాలా బాధకలిగించింది. తను ఇవ్వడం ఇష్టంలేకే అలా అన్నదని ఆయన అభిప్రాయపడ్డారా? ప్రతివిషయంలోనూ ఆయన తన నిలాగే అనుమానిస్తున్నారా? తనంటే ఏవిధమైన నమ్మకమూ, అభిమానమూ లేదా?

ఒక్కసారిగా ఆమెకు మనుష్యులమీద, లోకంమీద అసహ్యం వేసింది. అసలు లోపం తనలోనే ఉన్నదని గ్రహించింది ఆమె! అదే, తను రామకృష్ణకు నమ్మకం కలిగించాలని ప్రయత్నించడం! తనెందుకలా ప్రయత్నించాలి? అతను నమ్మకపోతే తనకు వచ్చిన నష్టమేమిటి?

ఆ రోజు సాయంత్రంవరకూ ఆమె పరధ్యానంగానే గడిపింది. సాయంత్రం దియ్యంలో బెడ్డలు ఏరుతూన్న వసుంధర "పిన్నీ!" అన్న పిలుపువిని ఉలిక్కిపడి వెనక్కి తిరికింది. రాజా! అప్పుడే బడినుండి వచ్చినట్టున్నాడు. ముభావంగా రాజువంక చూసింది ఆమె.

"నేనింకెప్పుడూ బాబును కొట్టను పిన్నీ, మరి నా మీద కోపం పోగొట్టుకోవూ?"

ఉలిక్కిపడింది వసుంధర. అంటే రాజుకి తన మీద కోపంలేదన్నమాట. తనకే వాడిమీద కోపముందేమోనని భయపడుతున్నాడన్నమాట!

"నిజంపిన్నీ, ఇంకెప్పుడూ నీకు కోపం తెప్పించను!" వసుంధరకు కన్నీళ్ళు వచ్చాయి. "రాజా!" అంటూ ఆమె వాడిని అక్కున చేర్చుకుంది.

"పిన్నీ!" అన్నాడు రాజా మళ్ళీ నెమ్మదిగా.

"ఏరా?"

"ప్రొద్దున్న నాన్న నాకు పావలా ఇచ్చాడు. నువ్వేమీ కొనుక్కోవద్దని చెప్పావుగా. అందుకని ఏమీ కొనుక్కోలేదు. నా దగ్గరఉంటే కొనుక్కోబుద్ధి వేస్తుందికాబట్టి ఇది నీ దగ్గిరే దాచి ఎప్పుడు కొనుక్కోమని ఇస్తే అప్పుడే కొనుక్కుంటాను. అందాకా నీ దగ్గిరే దాచవూ?"

అనుకోని ఆ సంఘటనకు ఆమె ఆశ్చర్యపోయింది. హృదయపూర్వకంగా ప్రేమిస్తున్నప్పుడు, ఆ ప్రేమ తప్పక అర్థంచేసుకుంటారు ప్రేమించబడేవాళ్ళు. ఎవళ్ళు నమ్మినా నమ్మకపోయినా రాజా తనను తండ్రికంటే ఎక్కువగా విశ్వసిస్తున్నాడు. అంతకంటే తనకు కావలసిందేముంది? అసలు తన సొంతంగానే ప్రేమ అర్థంచేసుకునేవాళ్ళెవరుంటారు? తనలోని మాతృప్రేమ కట్టలుతెంచుకోగా ఆమె వాడిని హృదయానికి మరింత గట్టిగా అదుముకొని—"నువ్వు నా బంగారు తండ్రివిరా రాజా!" అంది.

అప్పుడే కాలేజీనుంచి వచ్చి గుమ్మంవద్ద నిలబడ్డ రామకృష్ణకూడా ఆ దృశ్యం చూశాడు. ☆

ఉచితము! ఉచితము!!

## తెల్ల మచ్చలు

మా ప్రఖ్యాతి వహించిన 'బాగ్‌సాఫా' ప్రత్యేక ఔషధము తెల్ల మచ్చలను సులభముగా పోగొట్టుటలో 1925 సం॥ నుండి ప్రఖ్యాతి వహించి యున్నది. మూడురోజులు వాడినంతనే మచ్చల తెలుపుదనం అప్పైన కొన్నిరోజులలోనే పూర్తిగా బాగుచేయు శక్తి కలదు. ఉచితంగా ఒక పాకెట్ మందు ఇవ్వబడును. నకిలీలను చూచి మోసపోకండి.

BENGAL AYURVED BHAWAN
P.O. Katri Sarai (Gaya)

'చక్కెర' కలపని తియ్యని పానీయములు




స్పెన్సర్ వారి
ఆరెంజ్
జింజర్
లెమన్
కోలా